క్లుప్తంగా

అర్హతే ప్రామాణికం


పథకాలను వివరిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

గుర్ల: సంక్షేమ పథకాలను పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా, అర్హతే ప్రామాణికంగా అందిస్తున్నామని జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.సూర్యనారాయణ రాజు అన్నారు. మండల కేంద్రంలో నాలుగవ రోజు శనివారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. పేదల సంక్షేమం కోసం పనిచేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని అంతా ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు, బెల్లాన బంగారునాయుడు, తోట తిరుపతిరావు, జమ్ము స్వామినాయుడు, ఇజ్జిరోతు ప్రసాద్, సతివాడ సీతారాం, చందక రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠగా గుర్రాల పరుగు పోటీలు


పోటీలో పరుగు తీస్తున్న గుర్రం

వేపాడ: మండలంలోని చినగుడిపాలలో గ్రామదేవత పరదేశమ్మ తీర్థం సందర్భంగా శనివారం సాయంత్రం నిర్వహించిన గుర్రాల పరుగు ప్రదర్శన ఉత్కంఠగా సాగింది. పోటీల్లో విశాఖ, అనకాపల్లి, విజయనగరం జిల్లాలకు చెందిన 14 గుర్రాలు పాల్గొన్నాయి. మొదటి ఏడు స్థానాల్లో నిలిచిన గుర్రాలకు వరుసగా రూ.12, వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.7వేలు, రూ.6 వేలు, రూ.5 వేలు, రూ.4 వేల నగదు బహుమతులు అందజేశారు. బహుమతుల ప్రదానంలో డీసీసీబీ చైర్మన్ చినరామునాయుడు, సర్పంచ్ రామునాయుడు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మద్యం మాన్పించడమే 'ఏఏ' గ్రూపుల లక్ష్యం

శృంగవరపుకోట: మద్యం అలవాటు కాదని, వ్యసనం మాత్రమే అని మద్యానికి బానిసలైన వారిని మద్యం మత్తు నుంచి బయటికి తీసుకువచ్చేందుకు 'ఏఏ' (ఆల్కహాలిక్స్ ఎనానిమస్)గ్రూపులు సహాయ సహకారాలు అందిస్తాయని నిర్వాహకులు తెలిపారు. స్థానిక కేంబ్రిడ్జ్ పాఠశాలలో శనివారం ఏఏ గ్రూపు వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఏఏ గ్రూపు సభ్యులు పలువురు మాట్లాడుతూ మద్యానికి బానిసగా ఉన్న సమయంలో వారు పడిన ఇబ్బందులు, సమాజంలో ఎదురైన అనుభవాలను వివరించారు.ఏఏ గ్రూపులో చేరిన తర్వాత గ్రూపు సభ్యుల నైతిక మద్దతుతో మద్యానికి దూరమైన విధానాన్ని, తర్వాత తమ ఆర్థిక, జీవన స్థితిగతుల్లో వచ్చిన మార్పులను సభ్యులతో పంచుకున్నారు. మద్యం నుంచి బయటకు వద్దామని అనుకునే వారు హెల్ప్‌లైన్ నంబర్‌కు 90227 71011 ఫోన్ చేస్తే ఏఏ గ్రూపు సభ్యులు మీ వద్దకే వచ్చి సహకారం అందిస్తారని నిర్వాహకులు తెలిపారు. పలు జిల్లాలతో పాటు పొరుగు రాష్ట్రాలకు చెందిన ఏఏ సభ్యులు కుటుంబాలతో కలిసి పాల్గొన్నారు.

సోషల్ మీడియా కన్వీనర్ల నియామకం

శృంగవరపుకోట/ జామి/ గజపతినగరం/ గుర్ల/ చీపురుపల్లిరూరల్(గరివిడి): వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా మండల ఇన్‌చార్జ్‌లను నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎస్.కోట మండల కన్వీనర్‌గా మామిడి శంకరరావు, కో–కన్వీనర్లుగా బోని శ్రీనివాసరావు, కడారి జయశంకర్, మమ్ములూరి హర్ష, దేగల అచ్చారావు నియమితులయ్యారు.గజపతినగరం నియోజకవర్గంలో పరిధిలో ఉన్న జామి మండలంలోని 12 గ్రామాలకు సంబంధించి కన్వీనర్‌గా తాండ్రంగికి చెందిన కరక ధశరథ్, కో–కన్వీనర్లుగా భీమసింగి గ్రామానికి చెందిన గేదెల రమణబాబు, కుమరాం గ్రామానికి చెందిన కంది నర్సింగరావును నియమించారు. గజపతినగరం కన్వీనర్‌గా ముల్లు తాతినాయుడు, గుర్ల కన్వీనర్‌గా మంత్రి పైడినాయుడు, కో–కన్వీనర్లుగా వల్లూరి నరసింహమూర్తి, మీసాల సంతోష్, శిరుపరుపు గణేష్, పతివాడ కృష్ణ మోహన్, గరివిడి కన్వీనర్‌గా పల్లి అప్పలనాయుడు, కో–కన్వీనర్లుగా కొరణాన రాము,రేవల్ల సూరిబాబు, తాడ్డి రామకృష్ణ, పిన్నింటి శ్రీనివాస్‌ను పార్టీ నియమించింది.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

గజపతినగరం: ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ గంగరాజు ఆటోడ్రైవర్లను హెచ్చరించారు. స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సమీపంలో ఆటోస్టాండ్ వద్ద ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై శనివారం అవగాహన కల్పించారు. ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించినా, లైసెన్స్‌లేకుండా ఆటో నడిపినా కేసులు నమోదు చేయక తప్పదని అన్నారు. మైనర్లకు ఆటోలు ఇవ్వవద్దని సూచించారు.

పేదల అభ్యున్నతే లక్ష్యంగా పథకాలు


పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

కొత్తవలస: పేద ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు తెలిపారు. కొత్తవలస మేజర్ పంచాయతీలోని సచివాలయం–4 పరిధిలో సబ్బవరం రోడ్డు, నూకాలమ్మ గుడి, గవరపాలెంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, అవి సక్రమంగా అందుతున్నాయా లేదా, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పథకాల అమలు తీరుపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని, పలువురు ఇళ్ల స్థలాలు ఇప్పించాలని ఎమ్మెల్యేను కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ సీసీ రోడ్లు, డ్రైనేజీల సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామని చెప్పారు. అర్హతలు పరిశీలించి ఇళ్ల స్థలాల మంజూరుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధికి సీఎం జగన్ సమప్రాధాన్యం ఇస్తున్నారని, ప్రజల అవసరాలను గుర్తించి అందుకు అనుగుణంగా పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. సంక్షేమ పథకాల అమల్లోనూ మరో పక్క అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ ఇతర రాష్ట్రాలకు దీటుగా ముందుకు దూసుకు పోతోందన్నారు. ఇక్కడి పథకాలను పలు రాష్ట్ర ప్రభుత్వాలు తాము కూడా అమలు చేసేందుకు అధ్యయనం చేసేందుకు వస్తున్నాయని వివరించారు. పేదల పక్షపాతి జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. రానున్న ఎన్నికల్లో ఏదో ఒక విధంగా గద్దె నెక్కాలని టీడీపీ అనేక కుట్రలు పన్నుతోందని, తప్పుడు కథనాలను నిత్యం ఎల్లోమీడియా ద్వారా ప్రచారం చేయిస్తోందని, వారి మాయలో పడవద్దని ప్రజలకు సూచించారు. సర్పంచ్ ఎం.ఎర్రారామస్వామి, పీఏసీఎస్ చైర్మన్ గొరపల్లి జయప్రకాష్‌నారాయణ, ఏఎంసీ వైస్ చైర్మన్ బొంతల వెంకటరావు, వార్డు మెంబర్లు జి.ఏడుకొండలు, పూసర్ల రఘు, కారుమూరి కృష్ణ, పార్టీ నాయకులు మేలాస్త్రీ అప్పారావు,మాధవరావు, కోన ఈశ్వరరావు, సాల్మన్‌రాజు, లెంక భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహంలో వసతుల పరిశీలన


హాస్టల్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ ఉమాశంకర్, డీఈ పైడిరాజు

కొత్తవలస: స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో వసతులను కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బి.ఉమాశంకర్ శనివా రం పరిశీలించారు. కొత్తవలస ఆర్‌టీబీ సమీపంలో ఉన్న బీసీ బాలికల వసతిగృహం పాఠశాలకు దూరంగా ఉండడంతో దానిని బాలుర హాస్టల్ వద్దకు, బాలుర హాస్టల్‌ను బాలికల హాస్టల్‌కు మార్చాలని కలెక్టర్ సూచించారు. ఈ మేరకు ఎస్సీ హాస్టల్‌లో మౌలిక సదుపాయాలను ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఉమాశంకర్ క్షుణ్ణంగా పరిశీలించారు. మరుగుదొడ్లు పాడయ్యాయని, వంట గది లేదని, హాస్టల్‌కు సరైన దారి లేనట్లు గుర్తించామని ఆయన తెలిపారు. మరమ్మతులు,ఇతర పనులకు సుమారు రూ.5 లక్షల వరకు ఖర్చవుతుందని ప్రాథమిక అంచనా వేశామని, నివేదికను కలెక్టర్‌కు పంపించనున్నామని చెప్పారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కె.వి. పైడిరాజు, ఏఈ సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకలి తీర్చడమే ఫుడ్ బ్యాంక్‌ల లక్ష్యం

- నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి


ఫుడ్‌బ్యాంక్‌లో ఆహారం వడ్డిస్తున్న కోలగట్ల శ్రావణి, ఈశ్వర్ కౌశిక్

విజయనగరం: నగరంలో ఏర్పాటు చేసిన ఫుడ్ బ్యాంకులు అన్నార్తులకు ఆకలి తీరుస్తున్నాయని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు జి. ఈశ్వర్ కౌశిక్ అన్నారు. నగరంలోని ఎస్‌వీఎస్ థియేటర్ ఎదురుగా గల ఫుడ్ బ్యాంక్ వద్ద గౌరీ సేవా సంఘం కార్యదర్శి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ప్రతినిధి కనిశెట్టి సుధాకర్ తన తాతలు కనిశెట్టి పైడినాయుడు, పిల్ల సత్యారావుల జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన భోజన వసతిశాలను శ్రావణి, ఈశ్వర్‌కౌశిక్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మానవ సేవే మాధవ సేవగా భావించి స్వచ్ఛంద సంస్థలు, విజయనగరం కార్పొరేషన్ ముందుకు వచ్చి నాలుగు చోట్ల ఫుడ్ బ్యాంకులు ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆలోచనలకు అనుగుణంగా 18 నెలలుగా ఎటువంటి అవాంతరాలు లేకుండా ప్రతిరోజూ నిరుపేదలకు అన్నప్రసాదం అందించడం అభినందనీయమన్నారు. ఆకలిగా ఉన్నవారికి పట్టెడన్నం దొరుకుతుందన్న భరోసా ఫుడ్ బ్యాంకుల ద్వారా పేద ప్రజలకు లభిస్తోందని చెప్పారు. ఆదివారం నుంచి సంతపేట జగన్నాథస్వామి వారి ఆలయంలో యోగా శిక్షణ కార్యక్రమాలు, సూర్య నమస్కారాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కేంద్ర ఆస్పత్రి సలహా మండలి సభ్యుడు ఆడారి నగేష్, గౌరీ సేవాసంఘం అధ్యక్షుడు కాండ్రేగుల శేఖర్, కార్యదర్శి కనిశెట్టి సుధాకర్, చిన్నారావు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ప్రతి ధాన్యం గింజనూ కొనుగోలు చేస్తాం


చీపురుపల్లి: ధాన్యం పరిశీలించి, మిల్లులకు పంపిస్తున్న వ్యవసాయ అధికారులు

చీపురుపల్లి/ గుర్ల: ప్రభుత్వం ఆదేశాల ప్రకారం రైతుల నుంచి ప్రతి ధాన్యం గింజనూ కొనుగోలు చేస్తున్నామని వ్యవసాయ శాఖ జేడీ త్రినాథస్వామి చెప్పారు. చీపురుపల్లి రైతుభరోసా కేంద్రం (ఆర్బీకే)–3 పరిధిలో ధాన్యం కొనుగోలు తీరును, గుర్ల మండలం లోని గూడెంలో రైతుల కల్లాల వద్ద నిల్వ ఉన్న ధాన్యాన్ని శనివారం ఆయన పరిశీలించారు. చీపురుపల్లి ఆర్బీకే–3 పరిధిలో రైతులకు సంబంధించిన ధాన్యానికి అక్కడికక్కడే ట్రక్ షీట్లు సిద్ధం చేసి మిల్లులకు పంపించారు. ఈ ఆర్బీకే పరిధిలో ఇంకా మిగిలి ఉన్న 84 టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యాలను చేధించాలని సిబ్బందికి సూచించారు. గుర్ల మండలంలో ఇంకా రైతుల వద్ద ఉన్న 1300 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనగోలు చేస్తామని, ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని అన్నారు. ఆయన వెంట ఏడీఏ ఎన్.కోటేశ్వరరావు, ఏఓలు సీహెచ్.రఘునాథ్, తిరుపతిరావు, వీఏఏలు ఉన్నారు.

ఓటర్ల జాబితాలో అవకతవకలు


విలేకరులతో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

చీపురుపల్లి: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల జాబితాల్లో అవకతవకలు జరిగాయని సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు టి.వి.రమణ ఆరోపించారు. చీపురుపల్లిలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా తప్పులు తడకలుగా నమోదు చేశారన్నారు. నిబంధనల ప్రకారం డిగ్రీ ఆపైన చదువుకున్న వారికి మాత్రమే ఓటు హక్కు కల్పించాల్సి ఉన్నప్పటికీ, 107, 108 పోలింగ్ బూతుల్లో అర్హత లేని వారికి ఓటు హక్కు కల్పించారని, ఒకే వ్యక్తి పేరున నాలుగు ఓట్లు నమోదైన ఉదంతం కూడా చోటు చేసుకుందన్నారు. ఈనెల 13న అన్ని మండలాల్లో తహసీల్దార్‌లు, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షుడు ఏ.గౌరునాయుడు, డివిజన్ అధ్యక్షుడు జె.విశ్వనాథరాజు తదితరులు పాల్గొన్నారు.

వాసవి యూత్ క్లబ్ ప్రారంభం


నూతన కార్యవర్గానికి సూచనలు చేస్తున్న సంతోష్‌చక్రవర్తి

జామి: మండల కేంద్రంలో నూతనంగా వాసవి యూత్‌క్లబ్‌ను వాసవీయన్ క్రౌన్ స్టార్ కపుల్ కె.సి.జి.ఎఫ్.ఐ ఎస్.వి.సంతోష్ చక్రవర్తి శనివారం ప్రారంభించారు.అనంతరం క్లబ్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. క్లబ్ అధ్యక్షుడిగా తీగెల సతీష్ కుమార్, కార్యదర్శిగా కాపుగంటి రంజిత్ కుమార్, కోశాధికారిగా బొండాడ రామకృష్ణ మోహన్ ఎన్నికయ్యారు. అనంతరం కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. 214–ఏ రీజియన్ వాసవీ క్లబ్ జోన్ గవర్నర్ ఆత్మకూరి సతీష్, వైస్ గవర్నర్ సాంబమూర్తి ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు వాకచర్ల భాస్కరరావు, ఆర్య వైశ్యసంఘం నేతలు వి.సీతరామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

చీపురుపల్లి: పట్టణంలోని శ్రీనివాసా జూనియర్ కళాశాల వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. చదువులో ఉత్తమ ప్రతిభ కనబరిచే విద్యార్థులకు నగదు బహుమతులు ఇవ్వనున్నట్లు ప్రముఖ వ్యాపారి తంగుడు రామకృష్ణ ప్రకటించారు. ఇది వరకు ఉత్తమ ఫలితాలు సాధించిన పలువరు విద్యార్థులను సత్కరించారు. కళాశాల యాజమాన్య ప్రతినిధులు ప్రసాద్, మూర్తి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. కళాశాల అధ్యాపక సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

రాజీతో ఇరువర్గాలకు ప్రయోజనం


గజపతినగరం: కేసులు పరిష్కరిస్తున్న జడ్జి కనకలక్ష్మి


చీపురుపల్లి: లోక్ అదాలత్ నిర్వహిస్తున్న న్యాయమూర్తి విజయరామేశ్వరి


కొత్తవలస: లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జడ్జి సూర్యకిరణ్‌శ్రీ

- లోక్‌అదాలత్‌లో 2948 కేసులు పరిష్కారం


శృంగవరపుకోట: ఎస్.కోట న్యాయస్థానంలో లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జడ్జి వాణి

చీపురుపల్లి: కేసుల పేరుతో ఏళ్లతరబడి కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం,డబ్బు వృథా చేసుకునే బదులు ఇరువర్గాల జాతీయ లోక్ అదాలత్‌లో రాజీమార్గంలో కేసులను పరిష్కరించుకోవడం వల్ల సత్వర న్యాయం లభిస్తుందని, ఇరువర్గాలకూ ప్రయోజనం ఉంటుందని స్థానిక మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి ఎం.విజయరామేశ్వరి అన్నారు. స్థానిక కోర్టు హాల్‌లో శనివారం జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. సివిల్,క్రిమినల్,తదితర 850 కేసులను రాజీ మార్గంలో పరిష్కరించారు.

గజపతినగరంలో..

గజపతినగరం: స్థానిక సివిల్ కోర్టులో ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జూనియర్ సివిల్ జడ్జి బి.కనకలక్ష్మి ఆధ్వర్యంలో లోక్ అదాలత్ నిర్వహించారు. 923 కేసులను పరిష్కరించినట్లు జడ్జి తెలిపారు. న్యాయవాదులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ఎస్.కోటలో..

శృంగవరపుకోట: స్థానిక జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో 481 కేసులు పరిష్కరించినట్టు మండల న్యాయ సేవా కమిటీ చైర్‌పర్సన్ సబ్బవరపు వాణి తెలిపారు. జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులో 18 ఐపీసీ కేసులు, 9 చెక్‌బౌన్స్ కేసులు, 7 మనీసూట్స్, 2 టైటిల్ కేసులు, 8 ఈపీ, 1 మనోవర్తి, 1 పీఎల్‌సీ కేసులు, ద్వితీయశ్రేణి న్యాయస్థానంలో 435 క్రిమినల్ కేసులను పరిష్కరించారు. అదాలత్‌లో ఏపీపీ కేశవరావు, పలువురు న్యాయవా దులు, పోలీస్, ఆబ్కారీ శాఖల అధికారులు, పలు బ్యాంకర్లు పాల్గొన్నారు.

రూ.30.08 లక్షల అపరాధ రుసుం వసూళు

కొత్తవలస: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో కొత్తవలస, లక్కవరపుకోట, వేపాడ మండలాలకు సంబంధించిన 694 కేసులు రాజీ చేసినట్లు జూనియర్ సివిల్ జడ్జి,లోక్ అదాలత్ చైర్‌పర్సన్ ఎస్.సూర్యకిరణ్‌శ్రీ తెలిపారు. ఈ కేసులకు సంబంధించి రూ.30.08 లక్షలు అపరాద రుసుం వసూళు అయిందని చెప్పారు. న్యాయవాదులు సీహెచ్.ప్రసాద్, ఎం.వి.గిరి, కె.అచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం


అధికారులతో సమీక్షిస్తున్న ఎంపీపీ విజయలక్ష్మి

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మీసాల విజయలక్ష్మి ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. అధికారులు శాఖల వారీగా ప్రగతినివేదికలను సభకు చదివి వినిపించారు. పలు అభివృద్ధి పనులు, సమస్యల పరిష్కారంపై అధికారులతో ఎంపీపీ సమీక్ష చేశారు. కాపుశంబాం పీఏసీఎస్ అధ్యక్షుడు లెంక శ్రీరాములు మాట్లాడుతూ మండలంలో ఉపాధి పనులు మంజూరైన చెరువుల్లో ముందుగా రెవెన్యూ,ఉపాధి అధికారులు ఆక్రమణలు గుర్తించి, వాటిని తొలగించాకే పనులు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు గుడివాడ శ్రీరాములనాయుడు, జి.వెంకట అప్పలరాజువర్మ, ఎంపీడీఓ జి.భాస్కరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు, అన్ని పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫైలేరియా నివారణ మాత్రల పంపిణీ


చీపురుపల్లి: చీపురుపల్లి సచివాలయం-5 వద్ద డీఈసీ మాత్రలు పంపిణీ చేస్తున్న వైద్యాధికారి శ్రావ్య


గజపతినగరం: ఫైలేరియాపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సాయికృష్ణారెడ్డి


జామి: జామిలో చిన్నారులకు డీసీఈ మాత్రలు పంపిణీ చేస్తున్న వైద్యాధికారి భాగ్యరేఖ


శృంగవరపుకోట: ధర్మవరంలో డీఈసీ మాత్రలు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

చీపురుపల్లి: పట్టణంలోని గ్రామ సచివాలయం–5 పరిధిలో, మండలంలోని అలజంగి, పెదనడిపల్లి సచివాలయాల వద్ద కర్లాం పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రావ్య ఆధ్వర్యంలో శనివారం ఫైలేరియా(బోద కాలు వ్యాధి) నివారణకు డీఈసీ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం కర్లాం పీహెచ్‌సీ పరిధిలో 54 వేల మందికి మందులు పంపిణీ చేయాల్సి ఉండగా ఇంతవరకు 43 వేల మందికి పంపిణీ చేశామని చెప్పారు. ఇంకా మిగిలిన వారికి వలంటీర్లు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ, సచివాలయ సిబ్బంది సయుక్తంగా మాత్రలు పంపిణీ చేస్తారని తెలిపారు. గర్భిణులు, రెండేళ్ల లోపు చిన్నారులు, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వారు తప్ప మిగిలిన వారంతా ఈ మాత్రలు వేసుకోవాలన్నారు. ఎంపీహెచ్ఈఓ ఎల్.అప్పలనాయుడు, ఎంఎల్‌హెచ్‌పీలు మౌనిక, జోసఫ్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

అప్రమత్తతతో నివారణ

శృంగవరపుకోట: అప్రమత్తతతో ఫైలేరియా వ్యాధి నివారణ సాధ్యమని వైద్యారోగ్యశాఖ సిబ్బంది శనివారం ప్రచారం చేశారు. ధర్మవరం గ్రామంలో వైద్యారోగ్యశాఖ సిబ్బంది, ఆశ వర్కర్లు ఇంటింటికీ వెళ్లి ఫైలేరియా నివారణకు డీఈసీ, అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో 57,045 మందికి మాత్రలు పంపిణీ చేసేందుకు 145 బృందాల ద్వారా కార్యాచరణ ప్రారంభించామని సీహెచ్ఓ తారకరావు తెలిపారు.

ప్రతి ఒక్కరూ డీఈసీ మాత్రలు వేసుకోవాలి

జామి: రెండేళ్ల లోపు పిల్లలు, గర్భిణులతో పాటు క్యాన్సర్, కిడ్నీ తదితర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు మినహా మిగిలిన వారంతా డీఈసీ మాత్రలు వేసుకోవాలని జామి పీహెచ్‌సీ వైద్యాధికారి భాగ్యరేఖ తెలిపారు. మండల కేంద్రంలోని జామి రెల్లి కాలనీలో శనివారం డీఈసీ మాత్రలు పంపిణీ చేశారు. పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


కొత్తవలస రూరల్: వియ్యంపేట గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు మాత్రల పంపిణీ

15వేల మందికి పంపిణీ

గజపతినగరం: మండలంలోని మరుపల్లి పీహెచ్‌సీ పరిధిలో ఇంతవరకు 15 వేల మందితో డీఈసీ, అల్బెండజోల్ మాత్రలను కలిపి మింగించామని వైద్యాధికారి సాయికృష్ణారెడ్డి తెలిపారు. ఎం.వెంకటాపురం గ్రామంలో మాత్రల పంపిణీని శనివారం ఆయన పరిశీలించారు. ఫైలేరియా వ్యాధి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.గజపతినగరంలో సర్పంచ్ నరవ కొండమ్మ, ఆరోగ్య కార్యకర్త మంగమ్మ కలిసి పిల్లలకు డీఈసీ మాత్రలు పంపిణీ చేశారు.హెల్త్ అసిస్టెంట్ టి.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన అవసరం

కొత్తవలస రూరల్: సరైన అవగాహనతో బోద వ్యాధిని నిర్మూలించగలమని వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి వై.గోపాలకృష్ణ అన్నారు. వియ్యంపేట బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థినులకు డీఈసీ మాత్రలు, నులుపురుగుల నివారణకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. వియ్యంపేట పీహెచ్‌సీ పరిధిలోని 18,267 మంది ప్రజలకు మాత్రలు పంపిణీ చేశామని వైద్యాధికారి చెప్పారు. ప్రిన్సిపాల్ జయశ్రీ, ఎంపీహెచ్ఈఓ గోవిందరాజు, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.